

# అమ్మ యింటి బూడిద

ఒక అమ్మాయి చాలా గరీబు. ఎంత గరీబు అంటే వాళ్ల యింట్లో వాళ్ల అమ్మా నాన్నకు ఒంటి మీద ఒక జత ఉంటే ఉతకడానికి ఇంకో జత ఉండేది కాదు.

కానీ ఆ అమ్మాయి చాలా అందమైనది. ఆకాశంలో తారలు ఉంటాయే అలా ఛలక్ ఛలక్ అంటా ఉంటుంది.

అంతటి అందగత్తె ఒకరోజు ఒక రాకుమారుడి కంట పడింది.

రాకుమారుడు అంతటి అందగత్తెను వదులుతాడా? వెంటనే వలచాడు.

ఏడంతస్తుల మేడలో ఉండే రాకుమారుడు చిన్న గుడిసెలో ఉండే ఆ అందగత్తెని నిఖా చేసుకొని రాజమహల్‌కు తీసుకొని వెళ్లాడు.

రోజులు గడుస్తున్నాయి.

గరీబు అందగత్తెకు కాలు నేల మీద పెట్టాల్సిన అవసరం లేకుండా అన్నీ గడిచిపోతున్నాయి. భర్త మంచివాడు. బాగా చూసుకుంటున్నాడు. నెల తప్పిందని తెలిశాక అసలు బయటకు వెళ్లడమే మానుకొని ఆమెనే అతుక్కుపోయి ఉంటున్నాడు.

కానీ ఉన్నట్టుండి ఆ అమ్మాయి ఆరోగ్యం పాడైపోయింది. అంతుపట్టని రోగం. అది ఏం జబ్బో ఏం మాయదారిరోగమో ఎవరూ చెప్పలేక పోయారు. అమ్మాయి కళ్లల్లో కాంతి తగ్గిపోయింది. మొకంలో కళ తప్పింది.

రాకుమారుడు పరేషాన్ అయిపోయాడు. భార్యను సంతోషపెట్టడానికి ఏమిటేమిటో చేశాడు.

కానీ ఫలితం లేకపోయింది.

'నీకు ఏం కావాలి?' అని అడిగితే అమ్మాయి ఏమీ చెప్పేది కాదు.

భర్తతో నోరు తెరిచి ఏమైనా చెప్పుకునే రోజులా అవి?

అమ్మాయి రోజు రోజుకూ యింకా నీరసించిపోతోంది. కడుపులో బిడ్డ ఉన్న ఆడదాయె.

రాకుమారుడికి చెమటలు పట్టేశాయి. దిగులు కమ్ముకునింది.

రాజమహల్‌లో ఒక ముసలామె ఉంటే వెళ్లి 'అవా. ఏంది సంగతి. నువ్వు ఆడదానివి. లోకం చూసిన దానివి. ఎందుకు నా భార్య ఇలా అయిపోయింది' అని అడిగాడు.

అవ్వ చాలా సేపు ఆలోచించి 'నాయనా. అమ్మాయిని కాస్త వాళ్ల అమ్మగారింటికి పంపించు' అంది.

రాకుమారుడు ఆశ్చర్యపోయాడు.

'అవ్వా. అక్కడ ఏముందని పంపేది. వాళ్లసలే కడుపుకు తిండిలేక మలమలా మాడతా ఉంటారు. అట్టాంటి యింటికి కడుపుతో ఉన్న ఆడదాన్ని ఎలా పంపేది?' అని అడిగాడు.

'లేదు నాయనా. ఒకసారి పంపు' అంది అవ్వ.

రాకుమారుడు ఇక తప్పదన్నట్టుగా భార్యను వాళ్ల అమ్మగారింటికి భటుల తోడునిచ్చి పంపించాడు. కానీ అతడికి మనసు ఊరికే ఉండలేదు. అమ్మగారింటికి పోయి అమ్మాయి ఏం చేస్తుందో చూడాలని అనుకున్నాడు. ఆమెకు తెలియకుండా ఆమె వెనుకనే అనుసరించాడు.

అమ్మాయి నేరుగా అమ్మగారింటికి వెళ్లింది. చాలా రోజుల తర్వాత అమ్మను చూసి గట్టిగా కావలించుకొని ఆమె గుండెల మీద సేదతీరింది. తండ్రిని తృప్తిగా చూసుకొంది. అయినా ఆమె కళ్లల్లో వెలుగు రాలేదు. మొకంలో కళ కూడా రాలేదు.

'కడుపుతో ఉన్న కూతురు యింటికి వచ్చినా ఏమీ పెట్టలేకపోతున్నాం కదమ్మా' అని తల్లి వలవలా ఏడ్చింది.

అమ్మాయి చుట్టూ చూసింది. ఏమీ కనిపించలేదు. పొయ్యి వైపు చూసింది. ఆ పొయ్యిలో మంటపెట్టి ఎంత కాలమయ్యిందో. దగ్గరికి వెళ్లింది. అందులో కాసింత బూడిద కనిపించింది.

అంతే. ముందుకు వంగి చిటికెడు బూడిద తీసుకొని గబుక్కున నోట్లో వేసుకుంది.

క్షణాల్లో ఆమె కళ్లల్లో కాంతి వచ్చేసింది. మొఖంలో కళ వచ్చేసింది. సంతోషం వల్ల ఒళ్లంతా మెరిసి ఆరోగ్యం వచ్చేసింది. అమ్మాయి మునుపటి అమ్మాయిగా ఛలక్ ఛలక్‌మని మెరిసిపోయింది.

కిటికీ నుంచి ఇదంతా గమనించిన రాకుమారుడు గబగబా వెనక్కు వచ్చి రాజమహల్‌లోని అవ్వకు సంగతంతా చెప్పాడు.

'అంతే నాయనా. ఆడపిల్లకు పెళ్లయినా, భర్త దగ్గర ఎంతకాలం కాపురం చేసినా ఆమెకు అప్పుడప్పుడు తల్లిగారింటి నీళ్లు పడాలి. నీళ్లకు కూడా గతిలేకపోతే కనీసం అమ్మగారింటి బూడిదను కాసింత బొక్కినా చాలు. అదొక తృప్తి. ఆడపిల్ల మనసెరిగి ఆమెను అప్పుడప్పుడు అమ్మగారింటికి పంపిస్తుండు నాయనా' అని హితవు చెప్పింది.

అప్పట్నించి రాకుమారుడు అమ్మాయిని అప్పుడప్పుడు అమ్మగారింటికి పంపుతూ ఆమెను సంతోషపెడుతూ అతడూ సంతోషంగా ఉన్నాడు.